సాక్షి పల్నాడు

శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



తెనాలిలో పోలీసుల తనిఖీలు

తెనాలి రూరల్: తెనాలిలో గురువారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ స్వయంగా సోదాలను పర్యవేక్షించారు.



అలరించిన భక్తి సంకీర్తన

నగరంపాలెం: స్థానిక నల్లచెరువులోని శ్రీకోదండరామ మందిరంలో గురువారం నిర్వహించిన స్వరరాగ సుధా (గుంటూరు) భక్తి సంకీర్తన భక్తులను అలరించింది.

దేశమాంబకి ప్రత్యేక పూజలు



మంచాల (చేబ్రోలు): మండలంలోని మంచాల గ్రామ దేవత దేశమాంబకి శ్రావణ మాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

న్యూస్‌రీల్

సుదర్శన స్వామికి ప్రత్యేక పూజలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై గురువారం సుదర్శన స్వామికి ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో సుదర్శన పెరుమాళ్ తిరునక్షత్రం సందర్భంగా ఉదయం 9 గంటలకు సుదర్శన స్వామికి అభిషేకం, దృష్టి దోష నివారణ, దుష్ట గ్రహ దోష నివారణ, ఆయురారోగ్యాభివృద్ధికి సర్వరక్షాకర హోమం నిర్వహించామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో సుదర్శన పెరుమాళ్ల అనుగ్రహాన్ని పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన పేర్కొన్నారు.

అసభ్య ప్రవర్తన కేసులో పదేళ్ల జైలు

నరసరావుపేట టౌన్: కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తించిన తండ్రికి పది సంవత్సరాల జైలు శిక్ష, రూ.రెండు వేల జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం గురువారం తీర్పు చెప్పినట్లు టూటౌన్ సీఐ హైమారావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ వివాదాల నేపథ్యంలో తన భార్యకు దూరంగా ఉంటున్నాడు. అప్పటికే వారికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. చివరి కుమార్తె 5వ తరగతి చదువుతోంది. గతేడాది సెప్టెంబర్ 7న నిందితుడు మద్యం మత్తులో బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఇరుగుపొరుగు వారి సమాచారంతో అధికారులు వెళ్లి బాలికను కాపాడారు. రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగింది. కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో కోర్టు పై విధంగా తీర్పు ఇచ్చింది. కేసును రెండో పట్టణ సీఐ హైమారావు దర్యాప్తు చేయగా, ఏపీపీ బర్కత్ అలీఖాన్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ఎయిమ్స్‌లో ఆన్‌లైన్ సేవలకు అంతరాయం

45 నిమిషాల తర్వాత పునరుద్ధరణ



తాడేపల్లి రూరల్: మంగళగిరి ఎయిమ్స్‌లో గురువారం ఆన్‌లైన్ సేవలకు అంతరాయం కలిగింది. దీంతో ఓపీ దగ్గర భారీగా రోగులు నిలబడి ఆందోళన చేశారు. వెంటనే ఆసుపత్రి సిబ్బంది మాన్యువల్‌గా సేవలను అందించారు. 45 నిమిషాల అనంతరం ఆన్‌లైన్ సేవలను పునరుద్ధరించడంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తెల్లవారుజామునే వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ప్రతిరోజు వేల మంది వస్తున్నారు. నెలకు రెండు, మూడు సార్లు ఇదే పరిస్థితి ఏర్పడుతోందని అక్కడి సిబ్బంది తెలియజేశారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధి డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయిన వెంటనే మాన్యువల్ సేవలు అందజేశామని తెలిపారు. ఎక్కువ మంది రావడంతో కొంత ఇబ్బంది పడ్డామని పేర్కొన్నారు. అయితే సాధ్యమైనంత త్వరగా ఆన్‌లైన్ సేవలను పునరుద్ధరించినట్లు ఆయన పేర్కొన్నారు.


జిల్లా అథ్లెటిక్ క్రీడాకారుల జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): చీరాలలో ఈ నెల 9, 10 వ తేదీల్లో జరగనున్న అండర్–18, 20 యువతీ యువకుల అంతర్ జిల్లాల అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే జట్లను ఎంపిక చేసినట్లు అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డుతో శుక్రవారం స్థానిక బీఆర్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు సభ్యులు 9వ తేదీ ఉదయం 6 గంటలకు చీరాలలోని వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కాలేజీలోని క్రీడా మైదానంలో రిపోర్ట్ చేయాలన్నారు.

కృష్ణమ్మకు పోటెత్తిన వరద

- ముంపు గ్రామాలకు అధికారుల హెచ్చరికలు
- పులిచింతలకు 2,12,618 క్యూసెక్కులు విడుదల





ధ్యానబుద్ధ ఘాట్ వద్ద నిండుగా ప్రవహిస్తున్న కృష్ణా నది (ఇన్‌సెట్‌లో) ముంపులో ఉన్న కోళ్లూరు వద్ద తాటి చెట్లు దాటి వచ్చి నిండుకుండలా కనిపిస్తున్న కృష్ణమ్మ

బెల్లంకొండ: గురువారం కృష్ణా నదికి వరద పోటెత్తింది. పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి రెండు రోజులుగా వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైన ప్రవాహంతో బుధవారం వరకు ఖాళీ చేసిన గ్రామాలు పాక్షికంగా ముంపుకు గురవగా.. గురువారం అవి పూర్తిగా నీట మునిగాయి. ప్రాజెక్టు పరిధిలో ప్రస్తుతం దాదాపుగా 40 టీఎంసీల వరకు నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టులో నీటిని నిల్వతో బెల్లంకొండ మండలంలోని ముంపు గ్రామాలైన పులిచింతల, గొల్లపేట, కోళ్లూరు, భోదనం, చిట్యాల గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. ఎమ్మాజీగూడెం వరకు వరద నీరు చేరే అవకాశం ఉంది. దీంతో రెవెన్యూ, పోలీసు అధికారులు ఎమ్మాజీగూడెం ప్రజలను అప్రమత్తం చేశారు. ముంపు గ్రామాలలో పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ డి.ప్రవీణ్ సూచించారు.

పరివాహక ప్రాంతాలలో అప్రమత్తం

అమరావతి: కృష్ణా నదిపై ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి బుధవారం సుమారు 2 లక్షల క్యూసెక్కులకుపైగా నీరు విడుదల చేయటంతో అమరావతిలో గురువారం కృష్ణానది జలకళ సంతరించుకుంది ఒక్కసారిగా వరద వచ్చి పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ అందాలు తిలకించటానికి ప్రజలు వస్తున్నారు. మండలంలోని సుమారు 30 కిలోమీటర్ల మేర నదీ పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. పర్యాటక కేంద్రం అమరావతిలోని అమరేశ్వర ఘాట్, ధ్యానబుద్ధ ఘాట్ వద్దకు ప్రజలు అధికంగా తరలివచ్చారు. తగిన భద్రతా చర్యలు చేపట్టాలని పలువురు కోరారు.



టెయిల్ పాండ్ రిజర్వాయర్‌లో నిండుగా నీరు

నిండుకుండలా టెయిల్ పాండ్ రిజర్వాయర్

సత్రశాల (రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్దనున్న నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 14 క్రస్ట్‌గేట్లు ద్వారా 2,12,618 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. 3 మీటర్ల మేర గేట్లు ఎత్తామన్నారు. ప్రాజెక్టులో 75.50 మీటర్లకుగాను 74.34 మీటర్ల వరకు నీటిమట్టం చేరిందన్నారు. గరిష్ఠ నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 6.304 టీఎంసీలు ఉందని తెలిపారు. టీఆర్‌సీ లెవల్ 60.09 మీటర్లకు చేరుకుందన్నారు. ఎగువనున్న నాగార్జున సాగర్ నుంచి 2,26,015 క్యూసెక్కుల వరద ఇక్కడి ప్రాజెక్టుకు చేరుకుంటోందన్నారు. ప్రస్తుతం విద్యుత్ ప్రాజెక్టులోని రెండు యూనిట్ల ద్వారా ఉత్పత్తిని నిలిపివేసినట్లు వెల్లడించారు. నాగార్జునసాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

సాగర్ చెంత సందర్శకుల సందడి

విజయపురి సౌత్: నాగార్జున సాగర్, కొండకు గురువారం పర్యాటకులు తరలివచ్చారు. సాగర్ డ్యాం 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో తిలకించిన వస్తున్నారు. నాగసిరి, అగస్త్య లాంచీలలో నాగార్జున కొండకు తరలి వెళ్లారు. ఇలా రూ.48 వేల ఆదాయం చేకూరినట్లు అధికారులు తెలిపారు. మ్యూజియంలో బుద్ధుడి ప్రతిమలు, రాతి సామగ్రి, మట్టి కుండలు, బుద్ధుడి 9 అడుగుల పాలరాతి విగ్రహం, మహాస్థూపం, అశ్వమేధ యాగశాల, స్నానాల గట్లు, బోధి వృక్షం చూసి తన్మయత్వం చెందారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపీ స్టేడియం, శ్రీరంగనాథస్వామి దేవాలయం, అనంతరం 60 అడుగుల ఎత్తు నుంచి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. నాగార్జున సాగర్ డ్యాంపై 26 గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో నూతన బ్రిడ్జి, పాత వంతెన, లాంచీస్టేషన్, కృష్ణవేణి పుష్కర్‌ఘాట్ ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి.



క్రస్ట్‌గేట్ల వద్ద ఫొటో దిగుతున్న పర్యాటకులు

వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం రాష్ట్ర కమిటీలో ఇద్దరికి చోటు

నరసరావుపేట రూరల్: వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం రాష్ట్ర కమిటీలో పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు కల్పించారు. పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం 11 మందితో కూడిన రాష్ట్ర ఐటీ విభాగ కమిటీని ప్రకటించింది. ఇందులో గురజాల నియోజకవర్గానికి చెందిన నంద్యాల రాజశేఖరరెడ్డి, మాచర్ల నియోజకవర్గానికి చెందిన తాటికొండ హనిమిరెడ్డిలను కార్యదర్శులుగా నియమించారు.

ప్రతి రైతుకు 'అన్నదాత సుఖీభవ'

– జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు



నరసరావుపేట: అర్హత కలిగిన ప్రతి రైతుకు 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు జరిగేలా చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం ఈ పథకం అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు రెండో తేదీన రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు ఇవ్వనుందని, అదే రోజు కేంద్ర సర్కార్ కూడా తనవంతుగా రూ.2 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయనుందని తెలిపారు. జిల్లా, మండల స్థాయిల్లో ఈ కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరిగేలా చూడాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద కచ్చితంగా లబ్ధి చేకూరేలా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను, రైతులను భాగస్వాములను చేస్తామన్నారు. సమావేశంలో జేసీ సూరజ్ గనోరే, డీఆర్ఓ ఏకా మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ఏపీ విద్యార్థుల ప్రతిభ

- జేఎన్‌వీ ప్రాంతీయ స్థాయి యోగా క్రీడల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్న వైఎస్సార్ కడప క్లస్టర్
- ద్వితీయస్థానంలో నిలిచిన కృష్ణా క్లస్టర్
- త్వరలో జాతీయస్థాయి పోటీలకు అర్హత



వైఎస్సార్ కడప క్లస్టర్ విద్యార్థులకు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందిస్తున్న డీఎంహెచ్ఓ బి.రవి



రన్నరప్ ట్రోఫీని అందుకుంటున్న కృష్ణా క్లస్టర్ జేఎన్‌వీ విద్యార్థులు

యడ్లపాడు: ఆట ఏదైనా పోటీల నిర్వహణ క్రీడాకారులకు ఒక వేదిక మాత్రమేనని.. యోగాను జీవితంలో భాగం చేసుకోవడమే అసలైన విజయమని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.రవి పేర్కొన్నారు. చిలకలూరిపేట రూరల్ మండలం మద్దిరాలలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ పాఠశాలలో హైదరాబాద్ జేఎన్‌వీ రీజియన్ పరిధిలో నిర్వహించిన ప్రాంతీయస్థాయి యోగా క్రీడా ప్రదర్శన పోటీలు ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూడు విభాగాల్లో మూడు రోజుల పాటు కొనసాగిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమం గురువారం జరిగింది. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించడంలో యోగా ఒక దివ్యౌషధంగా ఉపయోగపడుతుందన్నారు. యోగా శిక్షణ యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన జీవితాన్ని అందిస్తుందన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు మాట్లాడుతూ యోగా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి నవోదయ జాతీయ క్రీడలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. పోటీల నిర్వహణకు సమన్వయంతో కృషి చేసిన విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పీఈటీలు ఆర్.పాండురంగారావు, జి.గోవిందమ్మ, అధ్యాపకులు, వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ఎస్కార్ట్‌లను అభినందించారు.

ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచిన 'వైఎస్సార్ కడప క్లస్టర్'

జవహర్ నవోదయ విద్యాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ప్రాంతీయస్థాయి యోగాక్రీడా ప్రదర్శన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ టైటిల్‌ను రాష్ట్రానికి చెందిన వైఎస్సార్ కడప క్లస్టర్‌లోని జేఎన్‌వీ సాధించుకుంది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలలోని 8 క్లస్టర్ల నుంచి క్లస్టర్ లెవర్ వరకు జరిగిన యోగా పోటీల్లో గెలుపొందిన జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. కృష్ణా, వైఎస్సార్ కడప, బీదర్, షిమోగా, తుమ్మకూర్, పట్నంతిట్టా, వైనాడ్, ఖమ్మం ప్రాంతాలకు చెందిన 278 మంది క్రీడాకారులు పాల్గొని ఆసనాలు, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో యోగా విన్యాసాలు ప్రదర్శించి తమ కళాత్మక నైపుణ్యాలను చాటారు. ఆయా పోటీల్లో రాష్ట్రానికి చెందిన వైఎస్సార్ కడప క్లస్టర్ జేఎన్‌వీ ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకోగా, కృష్ణా క్లస్టర్ ద్వితీయస్థానంలో నిలిచింది. వీటితో పాటు వివిధ విభాగాల్లో వ్యక్తిగతంగా విజేతలైన 42 మంది త్వరలో జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అర్హత సాధించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన 21 మంది విద్యార్థులు, 21 మంది విద్యార్థినులను మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించారు. అన్ని విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచి ఛాంపియన్‌షిప్‌గా నిలిచిన వైఎస్సార్ కడప క్లస్టర్ విద్యార్థులను, ద్వితీయస్థానంలో నిలిచిన కృష్ణా క్లస్టర్ విద్యార్థులను, షీల్డ్‌లు, సర్టిఫికెట్లతో సత్కరించారు.

ఉత్సాహంగా పోటీలు



చిలకలూరిపేట టౌన్/యడ్లపాడు: చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని జవహర్ పీఎంశ్రీ నవోదయ విద్యాలయం వేదికగా, దక్షిణ భారతదేశంలోని జేఎన్‌వీ విద్యార్థుల కోసం నిర్వహించిన ప్రాంతీయ స్థాయి యోగా ప్రదర్శన పోటీలు గురువారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీలు ఉత్సాహంగా సాగాయి. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని ఏపీ, తెలంగాణ, కేరళ, కర్ణాటకకు చెందిన 8 క్లస్టర్ల నుంచి 278 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూలై 29, 30, 31 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు అద్భుతమైన యోగా నైపుణ్యాలను ప్రదర్శించి అందరినీ అబ్బురపరిచారు. ఆసనాలు, రిథమిక్, ఆర్టిస్టిక్ (కళాత్మక) యోగా ప్రదర్శనలతో వేదికపై మెరుపులు మెరిపించారు. అండర్ –14, అండర్–17, అండర్ –19 విభాగాల్లో గ్రూపు, వ్యక్తిగత విభాగాల్లో బాలబాలికలు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పీఈటీ ఆర్ పాండురంగారావు, జి.గోవిందమ్మ, ఇతర అధ్యాపకులు పర్యవేక్షించారు.

బల్లి గండం తప్పింది!

- కోలుకుంటున్న కేజీబీవీ ఉపాధ్యాయినులు
- నలుగురికి ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స
- జిల్లా విద్యాశాఖాధికారి రేణుక పరామర్శ
- సాక్షి కథనంతో దిద్దుబాటు చర్యలకు దిగిన అధికారులు
- ఫుడ్ కాంట్రాక్టర్‌కు ఉద్వాసన
- అస్వస్థతకు గురైన వారిని ఇంటికి పంపేందుకు చర్యలు



ఉపాధ్యాయినుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఈవో రేణుక

తెనాలి అర్బన్: ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన కేజీబీవీ ఉపాధ్యాయినుల్లో నలుగురు ఇంకా తెనాలిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసే అవకాశం ఉంది. సాక్షి దినపత్రికలో ''భోజనంలో బల్లి–కేజీబీవీ ఉపాధ్యాయినులకు అస్వస్థత' అనే శీర్షికన గురువారం వార్త ప్రచురితం అయిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారిణి సీవీ రేణుక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయినులను పరామర్శించారు. ఇలాంటివి పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇన్ సర్వీస్ టీచర్ ప్రోగ్రాంపై శిక్షణ

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సమగ్ర శిక్ష విభాగం ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలిలోని జేఎంజే కళాశాలలో ఇన్ సర్వీస్ టీచర్ ప్రోగ్రాంను సోమవారం నుంచి నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని అనకాపల్లి, అనంతపూర్, అన్నమయ్య, ఏఎస్ఆర్, బాపట్ల, చిత్తూరు, ఏలూరు, కడప, కర్నూలు, మన్యం, నంద్యాల, ఎన్‌టీఆర్, పల్నాడు, ప్రకాశం, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు, శ్రీ సత్యసాయి, శ్రీకాకుళం, తిరుపతి, విజయనగరం జిల్లాల పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేసే 170 మంది ఉపాధ్యాయినులు తెనాలి వచ్చారు. వీరికి వసతిని కళాశాల యాజమాన్యం సమకూర్చింది. భోజనం, టిఫెన్స్‌లను ప్రభుత్వం నియమించిన వెండర్ సమకూరుస్తున్నారు.

పుల్కా కర్రీలో బల్లి

బుధవారం రాత్రి 8గంటల సమయంలో ఉపాధ్యాయినులకు భోజనం, టిఫెన్స్ సదరు వెండర్ ఏర్పాటు చేశారు. పుల్కా కర్రీలో అప్పటికి బల్లి పడింది. దీన్ని గమనించక అందరూ దానిని తిన్నారు. చివరి సమయంలో ఒక ఉపాధ్యాయిని బల్లిని గమనించి ఫిర్యాదు చేసింది. దీంతో అందరిలో ఆందోళన ప్రారంభమైనది. ఇలా జరిగిన కొద్ది గంటలకే సుమారు 14 మంది వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. అధికారులు వారికి మందులు పంపిణీ చేశారు. 14 మందిని చికిత్స నిమిత్తం తెనాలిలోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. 10మందికి ప్రాథమిక చికిత్స చేసి మరలా వసతి గృహానికి పంపారు. మిగిలిన నలుగురు వైద్యశాలలో గురువారం కూడా చికిత్స పొందుతూ వచ్చారు.

అప్రమత్తమైన అధికారులు

సాక్షిలో కథనం రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిపై ఆరా తీశారు. స్థానిక వీఆర్వో, ఉపాధ్యాయినుల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. మిగిలిన వారికి గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. సకాలంలో అప్రమత్తం కావడంతో ప్రాణ నష్టం తప్పింది.శిక్షణ తరగతికి తమ కళాశాలకు ఎటువంటి సంబంధం లేదని, అధికారుల ఆదేశాల మేరకు వసతి మాత్రమే కల్పించని జేఎంజే కళాశాల నిర్వాహకులు తెలిపారు.

కాంట్రాక్టర్‌ను మార్చాం

సంఘటన దురదృష్టకరం. భోజనం కాంట్రాక్టర్‌ను మార్చివేశాం. అస్వస్థతకు గురైన వారిని కొలుకున్న తరువాత స్వగృహాలకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– సి.వి.రేణుక, డీఈవో

ఇంజినీరింగ్ ప్రవేశాలకు నేటితో తెర

- కళాశాలలను మార్చుకునేందుకు నేడు చివరి అవకాశం
- మొదటి దశలోనే 90 శాతానికి పైగా సీట్లు భర్తీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు శుక్రవారంతో తెర పడనుంది. మేలో జరిగిన ఏపీ ఈఏపీసెట్–2025లో అర్హత సాధించి, వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఎస్సీహెచ్ఈ) ఇటీవల మొదటి విడతలో బీటెక్ సీట్లను కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్ కళాశాలల్లో మొదటి దశలోనే 90 శాతం మేరకు సీట్లు భర్తీ అయ్యాయి. చివరి దశ కౌన్సెలింగ్‌కు గడువు శుక్రవారం ముగియనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంతో పాటు నరసరావుపేటలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు ప్రైవేటు డీమ్డ్ యూనివర్సిటీలను కలుపుకుని 36 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు సహా కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్న 30,240 సీట్లలో 90 శాతానికి పైగా భర్తీ అయ్యాయి. ఈ మేరకు అధికారులు వెల్లడించారు.

కంప్యూటర్ కోర్సులకు ప్రాధాన్యత

కంప్యూటర్ సైన్స్‌లో సీట్లన్నీ భర్తీ అయ్యాయి. సీఎస్ఈతో పాటు అనుబంధంగా ఉన్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, బిగ్‌డేటా, ఐఓటీ, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లకు విద్యార్థులు తొలి ప్రాధాన్యత ఇచ్చారు. సీఎస్ఈ తరువాత ఐటీ, ఈసీఈ, మెకానికల్, ఈఈఈ బ్రాంచ్‌లను ఎంపిక చేసుకున్నారు. ఇప్పటికే వివిధ కళాశాలల్లో సీట్లు పొంది, ఇతర కళాశాలల్లో సీటు కోరుకునేందుకు ఎదురు చూస్తున్న విద్యార్థులు చివరి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవారం రాత్రిలోపు కొత్తగా ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.వీరికి ఈనెల 4న సీట్ల కేటాయింపు జరగనుంది. సీటు పొందిన కళాశాలల్లో అలాట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చి, అక్కడ చేరకుండా చివరి దశ కౌన్సెలింగ్‌కు వెళ్తున్నామని ముందస్తుగా సమాచారం ఇచ్చిన విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు అర్హులు. చివరి విడత కౌన్సెలింగ్‌లో సీటు పొందిన విద్యార్థులు ఈనెల 8వ తేదీలోపు సంబంధిత కళాశాలల్లో చేరాల్సి ఉంది.



ఇంజినీరింగ్ విద్యార్థులు (ఫైల్)

స్వచ్ఛందంగా ముందుకు వచ్చినవారినే ఎంపిక చేయండి

పీ 4పై అధికారులకు సూచించిన కలెక్టర్ పి.అరుణ్ బాబు



నరసరావుపేట: పీ ఫోర్ పథకంలో భాగంగా బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారిని మాత్రమే మార్గదర్శకులుగా ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం స్వర్ణాంధ్ర, పీఫోర్ ఫౌండేషన్, అన్నదాత సుఖీభవ కార్యక్రమాలపై చీఫ్ సెక్రటరీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో మురళితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ మార్గదర్శకులుగా చేరాలని ఎవరినీ ఎటువంటి ఒత్తిడికి గురిచేయొద్దన్నారు.

స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన సీపీఓ ..

స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన సీపీఓ జి.శ్రీనివాస్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబు సత్కరించారు. శేషజీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్ఓ మురళి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రక్తదానం చేసిన డీఆర్ఎం సుధేష్ట సేన్



రక్త దానం చేస్తున్న డీఆర్ఎం

లక్ష్మీపురం: ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని, రక్తదానం చేయడం అంటే ఒక ప్రాణాన్ని కాపాడటమే అని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ట సేన్ అన్నారు. నగరంపాలెంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గల రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సెంటర్‌లో గుంటూరు రైల్వే డివిజన్ కార్యాలయ సిబ్బందితో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా డీఆర్ఎం శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛందంగా చిన్నతనం నుంచి రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు. క్రమం తప్పకుండా దాతగా ఉన్నానని చెప్పారు. యువతీ, యువకులంతా క్లిష్టమైన వైద్య, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే శక్తి ఉన్న గొప్ప లక్ష్యంలో చేరాలని కోరారు. గుంటూరు రైల్వే డివిజన్ అభివృద్ధితో పాటు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ముందంజలో ఉండాలని సూచించారు. అనంతరం డివిజన్ పరిధిలో 74 మంది సిబ్బంది, అధికారులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం.రమేష్ కుమార్, సీనియర్ డివిజనల్ పర్సన్ ఆఫీసర్ షహబాజ్ హనూర్, సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ అమూల్యా బి. రాజ్, సీనియర్ డివిజనల్ మెటీరియల్స్ మేనేజర్ కార్తికేయ గాడఖ్, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కమలాకర్‌బాబు, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ విజయ కార్తి, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేష్‌కుమార్, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వైద్య అధికారి డాక్టర్ మేడూరి భాస్కరరావు, జిల్లా సమన్వయకర్త రసూల్ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు



తాడేపల్లి రూరల్ : జిల్లా స్థాయి రోడ్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు గురువారంతో ముగిశాయి. పోటీలను తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి గీతాంజలి స్కూలులో నిర్వహించారు. జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రమాదేవి, ప్రిన్సిపాల్ దీనకుమారి, వైస్ ప్రిన్సిపాల్ మౌనిక, గుంటూరు జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నిర్వహణ కార్యదర్శి ఇమ్మానియేలు రాజు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. సుమారు 32 నుండి 35 ఏళ్ల వ్యక్తి స్టేషన్ ఉత్తర కేబిన్ వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ సొగసు చూడతరమా..!

- నిండుకుండలా సాగర్ జలాశయం
- చరిత్రకు సాక్ష్యం నాగార్జున కొండ
- మనసుదోచే ఎత్తిపోతల

విజయపురిసౌత్: నాగార్జున సాగర్‌కు కొత్త నీరు వచ్చి నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరటంతో జలాశయం కొత్త అందాలను సంతరించుకుంది. గత మూడు రోజులుగా సాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్లు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. అంతేకాకుండా నిండుకుండలా కనపడుతున్న సాగర్‌లో జలాశయం మీదుగా లాంచీలో నాగార్జునకొండకు వెళ్లటం పర్యాటకులకు మరుపురాని అనుభూతిగా మిగిలిపోతుంది. దీంతో నిత్యం రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది పర్యాటకులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో సాగర్ చుట్టుపక్కల సందర్శనీయ స్థలాలపై ప్రత్యేక కథనం..




కృష్ణమ్మ పరవళ్లతో నాగార్జున సాగర్ ప్రాజెక్టు

ప్రధాన జలవిద్యుత్ కేంద్రం

ఇది సాగర్ ప్రధాన డ్యాం దిగువ ప్రాంతంలో ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ఉంటుంది. ఈ జలవిద్యుత్ కేంద్రాన్ని సాగర్ జెన్‌కో ఎస్ఈ అనుమతి తీసుకొని సందర్శించాల్సి ఉంటుంది.

భక్తుల కోర్కెలు తీర్చే సాగర్‌మాత

విజయపురిసౌత్‌లోని కృష్ణానది తీరంలో వేంచేసియున్న సాగర్‌మాత దేవాలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు. భక్తుల కోర్కెలు తీర్చే చల్లనితల్లిగా సాగర్‌మాతకు విశిష్టమైన పేరు ఉంది. ఇక్కడ నెలకొల్పిన్న జపమాల క్షేత్రం రాష్ట్రంలోనే ప్రత్యేకమైంది.



చూపరుల మనస్సుదోచే ఎత్తిపోతల



ఇది సాగర్ నుంచి మాచర్లకు వెళ్ళే రహదారిలో 14కిలో మీటర్ల దూరంలో ఉంది. చంద్రవంక వాగుపై సహజసిద్ధంగా ఏర్పడిన జలపాతం ఇది. 70 అడుగుల పై నుంచి జాలువారే నీటి దృశ్యం పర్యాటకుల మనస్సు దోచుకుంటుంది. జలపాతం చూసేందుకు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 టికెట్ ధరను టూరిజంశాఖ వసూలు చేస్తుంది. ఇక్కడ పర్యాటకుల సౌకర్యార్థం రాత్రి బస చేసేందకు 8 రూములు ఉన్నాయి. 5 ఏసీరూమ్‌లు, 3 నాన్‌ఏసీ రూములు ఉన్నాయి. ఏసీ రూమ్ ధర రూ.1,600, నాన్‌ఏసీ రూ.వెయ్యి. ఇతర వివరాలకు ఎత్తిపోతల మేనేజర్ దత్తకుమార్ ఫోన్ నెంబర్ 94414 53115లో సంప్రదించవచ్చు.

చరిత్రకు ప్రతిరూపం నాగార్జునకొండ

నాగార్జునకొండకు వెళ్లాలంటే విజయపురిసౌత్‌లోని లాంచీస్టేషన్ నుంచి 14 కి.మీ.దూరం కృష్ణానదిలో ప్రయాణం చేయాలి. కొండకు చేరుకునేందుకు లాంచీలో 45 నిమిషాల సమయం పడుతుంది. నాగార్జునకొండ ప్రపంచంలోనే రెండవ ఐలాండ్ మ్యూజియం. నాగార్జున సాగర్ పరిధిలోని విజయపురిసౌత్‌లో లాంచీస్టేషన్ నుంచి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లాంచీలు పర్యాటకులకు అందుబాటులో ఉంటాయి. పెద్దలకు లాంచీ టిక్కెట్టు ధర రూ.200, పిల్లలకు రూ 150, మ్యూజియం, మాన్యుమెంట్ సందర్శనకు రూ.30, మ్యూజియం సందర్శనకు 15 సంవత్సరాలలోపు చిన్నారులకు ఉచితం. విజ్ఞాన విహార యాత్రకు గ్రూపుగా వచ్చే విద్యార్థులకు లాంచీ టిక్కెట్‌పై 15 శాతం రాయితీ పర్యాటకశాఖ ఇస్తుంది. అలాగే పార్టీలకు, ఫంక్షన్‌లకు శాంతిసిరి లాంచీకి గంటకు రూ.10,000, అగస్త్య లాంచీకి గంటకు రూ.8,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు లాంచీస్టేషన్ ఫోన్ 9705188311 నెంబర్‌ను సంప్రదించవచ్చు.



గత ఆనవాళ్లకు చిరునామా అనుపు



నాగార్జునసాగర్ 7కి.మీ. దూరంలో అనుపు పర్యాటక కేంద్రం ఉంది. ఇక్కడ ఆనాటి నాగార్జున విశ్వ విద్యాలయం, ఇక్ష్వాకుల కాలం నాటి యాంఫీ స్టేడియం ఆనవాళ్లు ఉన్నాయి. కృష్ణానది లోయలో లభించిన రంగనాథస్వామి దేవాలయాన్ని అదే రాతితో అనుపులోని కృష్ణానది తీరంలో నిర్మించటం విశేషం.

జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి



నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లాలో క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. పల్నాడు జిల్లా జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం గురువారం వినుకొండరోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్ నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ అసోసియేషన్ ఏర్పాటుతో జిల్లాలో జూడోను క్రీడా శాఖతో అనుసంధానమై అభివృద్ధి చేయాలని సూచించారు. ఉమ్మడి గుంటూరుజిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి, జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సుబ్బారావు, సీఈఓ నామిశెట్టి వెంకట్, ఉపాధ్యక్షుడు చింతా శ్రీను, జాయింట్ సెక్రటరీ గమిడి శ్రీనివాసరావు, రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, వాగ్దేవి విద్యాసంస్థల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు తదితరుల పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం..

పల్నాడుజిల్లా జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా పసుపులేటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కొప్పుల నరసింహారావు, కోశాధికారిగా కె.రాజగోపాల్, ఉపాధ్యక్షులుగా కొప్పుల పార్వతి, జాయింట్ సెక్రటరీగా బి.బాలమురళీకృష్ణ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా బి.మల్లికార్జున, పి.రామకృష్ణ, ఆర్.గోపీనాయక్, రాజు, ఎస్.శివ, ఈ.రామాంజనేయులు ఎన్నికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

అంతర్ జిల్లాల దొంగలు అరెస్ట్

- రూ.25 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్న గుంటూరు పట్టాభిపురం పోలీసులు
- వివరాలు వెల్లడించిన వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్



వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, సిబ్బంది

లక్ష్మీపురం: చెడు వ్యసనాలకు అలవాటు పడి, దొంగతనాలు చేయడమే వృత్తిగా చేసుకున్న ముగ్గురు అంతర్ జిల్లాల దొంగలను గురువారం పట్టాభిపురం పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.25 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో సీసీఎస్ అధికారులకు, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐ టి.సుబ్బారావులకు వచ్చిన సమాచారం మేరకు గుంటూరు నగరంలోని చుట్టుగుంట-చిలకలూరిపేట జాతీయ రహదారి వై-జంక్షన్ వద్ద సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. వై. జంక్షన్ వైపు నుంచి వస్తున్న ఓ ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులతో డ్రైవర్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి ముగ్గురిని అదుపులో తీసుకోగా ఉప్పాల సురేష్ పరారయ్యాడు. మిగిలిని ముగ్గురిని స్టేషన్‌కు తరలించి విచారించారు. ఇందులో పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం, మాదల గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకీపై రాష్ట్ర వ్యాప్తంగా 24 స్నాచింగ్ , ద్విచక్ర వాహనాల దొంగతనాలతో పాటు ఇళ్లలో చోరీ కేసులు ఉన్నాయి. ప్రస్తుతం గుంటూరు నల్లచెరువులో నివాసం ఉంటున్నాడు. నల్గొండ జిల్లా, పెద్ద అడిచెరల్లపల్లి మండలం, రంగారెడ్డి గూడెం గ్రామానికి చెందిన ఊరడి జనార్దన్ అలియాస్ జానిపై రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్‌లలో 10 స్నాచింగ్ కేసులు, ద్విచక్ర వాహనం దొంగతనాలతో పాటు ఇళ్లలో చోరీ కేసులు ఉన్నాయి పల్నాడు జిల్లా, ముప్పాళ్ల మండలం, మాదల గ్రామానికి చెందిన తమ్మిశెట్టి మణికంఠపై గుంటూరు నగరంలో పలు చోరీ కేసులు ఉన్నాయి. ఇటీవల అనకాపల్లి రూరల్ పోలీస్‌లు ముగ్గురిని జూన్ 23న అరెస్ట్ చేసి అనకాపల్లి సబ్ జైలుకు తరలించారు. రిమాండ్ నుంచి మరుసటి రోజు జూన్ 24న బయటకు వచ్చారు.

నగరంలో పలు దొంగతనాలు

గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణానగర్ 4వ లైన్లో బాలాజీ ప్రొడక్ట్స్ సంస్థ కార్యాలయంలో తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, ఊరడి జనార్దన్, తమ్మిశెట్టి మణికంఠ, ఉప్పాల సురేష్‌లు కలిసి లక్ష రూపాయలతో పాటు 104 అమెరికా డాలర్స్‌ను దొంగలించారు. జూలై 12న గుంటూరు నగరాలు ప్రాంతంలో ట్రావెల్స్ నిర్వాహకుడు షేక్ ఫహీమ్ దగ్గరికి వెళ్లి కారు కొనేందుకు వచ్చామని నమ్మించారు. అదే రోజు సాయంత్రం కార్‌ను ట్రైల్ వేస్తామని చెప్పి అక్కడి నుంచి పరారయ్యారు. జూలై 18న రాత్రి బాపట్ల జిల్లా ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో టీవీ, గాజులు చోరీ చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్, సీసీఎస్ సిబ్బందితో కలిసి పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. నేరాలకు పాల్పడుతున్న వారి కోసం గాలింపులు, తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో బుధవారం వై.జంక్షన్ వద్ద తనిఖీలలో ఆటోలో నుంచి పరారీ అవుతుండగా నలుగురిలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అంతర్ జిల్లాల దొంగలను పట్టుకున్న సిబ్బందిని, సీసీఎస్ అధికారులను, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐ సుబ్బారావు, ఏఎస్ఐ వీరాంజనేయులు, ఎం.ఆంథోని, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుల్ మాణిక్యరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం

- మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ 5న సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నా
- జయప్రదం చేయాలని సీపీఎం నాయకుల పిలుపు



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు విజయకుమార్, గోపాలరావు, రవిబాబు

నరసరావుపేట: విద్యుత్ చార్జీలు పెంచినా, స్మార్ట్ మీటర్లు బిగించినా ప్రజా ఉద్యమం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో రైతు సంఘ జిల్లా ప్రధాన ఏపూరి గోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్మార్ట్ మీటర్లు అంగీకరించిన వారికి బిగించమని చెప్పారని, అంగీకారాలతో సంబంధం లేకుండా ప్రక్రియ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విద్యుత్ సంస్కరణల పేరుతో సామాన్య ప్రజలపై పెనుభారాలు మోపుతూ కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. గతంలో విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచడంతో ప్రజా తిరుగుబాటుతో ప్రభుత్వం కూలిపోయిందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సెకీతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే కొనసాగించడాన్ని తప్పుపట్టారు. ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీలతో ఈనెల 5న విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద, సచివాలయాల వద్ద జరిగే నిరసన ధర్నాలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ఊపందుకున్న నేపథ్యంలో రైతులు వద్ద ఉన్న పొగాకు కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. నాగార్జునసాగర్ ముంపు ప్రాంతాలలో ప్రజలకు పునరావాసం కల్పించాలని కోరారు. తొలకరి వర్షాలకు పత్తి సాగుచేసి తీవ్ర వర్షాభావ పరిస్థితులను నేపథ్యంలో నష్టపోయిన రైతులకు పత్తి విత్తనాలు కొనుగోలు చేసేందుకు ఇన్పుట్ సబ్సిడీ కింద నగదు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రవిబాబు పాల్గొన్నారు.

నేడు ఐవీఎఫ్ సెంటర్లలో తనిఖీలు

గతంలో సృష్టి సెంటర్‌పై కేసు నమోదు

గుంటూరు మెడికల్: సంతానం లేని దంపతులకు అనైతిక పద్ధతిలో సంతానం కలిగిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సృష్టి ఐవీఎఫ్ సెంటర్‌పై ఇటీవల కాలంలో వైజాగ్, హైదరాబాద్‌లలో కేసులు నమోదయ్యాయి. సృష్టి ఐవీఎఫ్ సెంటర్ శాఖలు రాష్ట్రవ్యాప్తంగా గుంటూరు, విజయవాడ, ఇతర ప్రాంతాల్లో ఉండటంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్లు అప్రమత్తమై తగు ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లాల వైద్య అధికారులు జిల్లా వ్యాప్తంగా ఐవీఎఫ్ సెంటర్లు తనిఖీ చేసి నివేదిక అందించాలని గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ జూమ్ కాన్ఫరెన్సు ద్వారా అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న 27 ఐవీఎఫ్ సెంటర్లలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేపట్టనున్నారు. తెనాలి, మంగళగిరి, గుంటూరులలో ఉన్న ఐవీఎఫ్ సెంటర్లలో గైనకాలజిస్టులు, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, ఇతర వైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టనున్నారు.

గతంలో కేసు నమోదు ..

గతంలో గుంటూరు జిల్లాలో సృష్టి టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్‌పై కేసు నమోదైంది. గుంటూరు కేంద్రంగా సృష్టి ఐవీఎఫ్ కేంద్రం ద్వారా సంతానం లేనివారికి చికిత్స అందించారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ఓజంటకు మగసంతానం పుట్టిస్తామని, నమ్మించి ఆడ శిశువును ఇవ్వడంతో సదరు దంపతులు ఆందోళన చేసి కేసు పెట్టారు. దీంతో గుంటూరులో పనిచేస్తున్న సృష్టి ఐవీఎఫ్ సెంటర్‌ను వైద్య అధికారులు మూసివేసి గర్భస్థ పూర్వ లింగనిర్ధారణ చట్టాన్ని అతిక్రమించి (పీసీపీఎన్‌డీటీ) లింగనిర్ధారణ పరీక్షలు చేసినట్లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మరలా తాజాగా సృష్టి ఐవీఎఫ్ సెంటర్లపై పలు చోట్ల ఆరోపణలు రావడం, కేసులు నమోదవడంతో నేడు రాష్ట్రవ్యాప్తంగా సృష్టి ఐవీఎఫ్ పనితీరు చర్చనీయాంశంగా మారింది.

నిబంధనలు అతిక్రమించినా చర్యలు నిల్..

జిల్లాలో ఐవీఎఫ్ సెంటర్లు 27 ఉన్నాయి. వీటిల్లో నిబంధనల ప్రకారం చికిత్స అందించడం లేదని, పలువురు బాధితులు ఆరోపణలు చేస్తున్నారు. ఐవీఎఫ్ సెంటర్‌లలో ఉండాల్సిన వైద్యపరికరాలు, వైద్య సిబ్బంది సరిపడా లేరు. అంతేకాకుండా వైద్య చికిత్సల కోసం వెళ్లేవారికి రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఫీజు వసూలు చేసి , ఇల్లు , ఒళ్లు గుల్ల చేస్తున్నారు. దీనిపై డీఎంహెచ్ఓ కార్యాలయ అధికారులు ఇప్పటి వరకు తనిఖీ చేసిన దాఖలాలు, కేసు నమోదు చేసిన దాఖలాలు ఎక్కడా లేవు. కనీసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు జరుగుతున్న తనిఖీల్లో నిబంధనలు పాటించనివారిపై చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో పెట్టకుండా రూ. లక్షల్లో ఫీజు వసూలు చేస్తున్న ఐవీఎఫ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

చేనేతను నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

చీరాల: జూలై 31వ తేదీని అధికారికంగా చేనేత దినోత్సవంగా ప్రకటించాలని జాతీయ చేనేత నాయకులు, చేనేత ఉద్యమకారులు మాచర్ల మోహనరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్ర చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని జాండ్రపేటలోని శ్రీచౌడేశ్వరి దేవాంగ కల్యాణ మండపంలో గురువారం చేనేత సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తీవ్ర మార్కెట్ సంక్షోభం ఎదుర్కొంటున్న చేనేత పరిశ్రమపై ప్రస్తుతం ఉన్న ఐదు శాతం జీఎస్టీని వచ్చే సెప్టెంబర్ నుంచి 12 శాతానికి పెంచుతున్నట్లు జీఎస్టీ కౌన్సిల్ ప్రకటించడం దారుణం అన్నారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు దేవన వీరనాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించడంతోపాటు చేనేత కార్మికులకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర మాట్లాడుతూ చేనేత పరిశ్రమపై ఉన్న జీఎస్టీ రద్దు చేయకపోవడం వలన చేనేతకు మూలాధారమైన నూలు ధరలు అసాధారణంగా పెరగడంతో చేనేత ఉత్పత్తి మందగించి కార్మికుల పనిదినాలు తగ్గిపోవడంతో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని అన్నారు. అనంతరం దేశాయిపేట నుంచి జాండ్రపేట వరకు రాష్ట్ర చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో చేనేత పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. చీరాలలో చేనేత పార్కు ఏర్పాటు చేయాలని, చేనేత వృత్తి భద్రత కల్పించాలని, చేనేతపై జీఎస్టీని ఎత్తివేయాలని కార్మికులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో చేనేత నాయకులు దామర్ల శ్రీకృష్ణ, సీపీఐ నాయకులు బత్తుల శామ్యూల్, బీసి ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ చుండూరు వాసు, చీరాల నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి నాయకులు శీలం రవికుమార్, దేవన హేమసుందరరావు, గుంటూరు మల్లికార్జున్, సజ్జా శ్రీనివాసరావు, వావిలాల దాశరథి, మునగాల వెంకటేశ్వర్లు, ఓరుగంటి రెడ్డి రిజర్వేషన్ సమితి నాయకులు మేడిబోయిన వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



అవనిగడ్డ: పెళ్లికి పెద్దలు అభ్యంతరం చెప్పడంతో ఆలయంలో పెళ్లి చేసుకున్న ఓ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే స్థానిక ఆరో వార్డుకు చెందిన చింతలపూడి నాగవర్ధన్, బాపట్ల జిల్లా రేపల్లె ఏడో వార్డుకు చెందిన తోట సాయి మౌనిక కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరి పెళ్లికి మౌనిక తల్లిదండ్రులు అభ్యంతరం చెప్పడంతో గురువారం మోపిదేవి మండల పరిధిలోని పెదప్రోలు అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం ఈ ప్రేమజంట స్థానిక ఎస్ఐ శ్రీనివాస్‌ని ఆశ్రయించడంతో ఇరువురు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కోసం సమాచారం ఇచ్చారు. మౌనిక తల్లిదండ్రులు రాకపోవడంతో నాగవర్ధన్ తల్లిదండ్రులను పిలిపించి వారికి అప్పగించారు.

ఏడు మండలాల్లో తేలికపాటి వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు ఏడు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అత్యధికంగా పెదకాకాని మండలంలో 6 మిల్లీమీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా మంగళగిరి మండలంలో మిల్లీమీటరు వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు పశ్చిమలో 3.2 మి.మీ., తాడికొండ 3.2, దుగ్గిరాల 2.8, గుంటూరు తూర్పు 2.4, తుళ్లూరు మండలంలో 2.2 మి.మీ చొప్పున వర్షం పడింది.


నేడు అమ్మవారికి పసుపు కొమ్ములతో అలంకరణ

పెదకాకాని: శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ భ్రమరాంబ అమ్మవారు పసుప కొమ్ములు ప్రత్యేక అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమివ్వనున్నారు. శ్రావణమాసంలో రానున్న శుక్రవారాల్లో భ్రమరాంబ అమ్మవారిని చీరలు, గాజుల అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుందని డీసీ గోగినేని లీలాకుమార్ తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 6,522 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 6,522 క్యూసెక్కులు గురువారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 276 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,748, క్యూసెక్కులు, తూర్పు కాలువకు 681, పశ్చిమ కాలువకు 270, నిజాపట్నం కాలువకు 506, కొమ్మూరు కాలువకు 2,680 క్యూసెక్కులు, బ్యారేజి నుంచి సముద్రంలోకి 2,72,750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు.

పరిశ్రమ వద్ద నీటి సంపులో పడి కార్మికుడి మృతి



పరిశ్రమ వద్ద నీటి సంపులో పడి మృతి చెందిన శ్రీరామ్

నాయుడుపేట టౌన్: తిరుపతి జిల్లా నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్ పరిధి ఉన్న ఓ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుడు శ్రీరామ్(21) గురువారం ప్రమాదవశాత్తూ నీటి సంపులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు. గుంటూరుకు చెందిన శ్రీరామ్ రెండేళ్లుగా మేనకూరు సెజ్ పరిధిలోని బ్రేక్స్ ఇండియా పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శ్రీరామ్ వెంకటగిరి పట్టణంలో నివాసం ఉంటు ప్రతిరోజూ పరిశ్రమకు వస్తుంటాడు. ఈ క్రమంలోనే గురువారం విధులకు హాజరై నీటి సంపు సమీపంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తూ అందులో పడిపోయాడు. చాలా పైనుంచి నీటి సంపులో పడిపోయిన శ్రీరామ్‌ను అక్కడి కార్మికులు గుర్తించి నీటి సంపు నుంచి బయటకు తీసి హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి శ్రీరామ్ అప్పటికే మృతిచెందినట్లుగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న సీఐ బాబి వైద్యశాలకు వద్దకు వెళ్లి పరిశీలించారు. పరిశ్రమ వద్దకు వెళ్లి అక్కడి నీటి సంపు తదితర ప్రాంతాలను పరిశీలించారు. శ్రీరామ్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.